క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



సంగెం : శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే చర్యలు తీసుకుంటామని గీసుకొండ సీఐ మహేందర్ హెచ్చరించారు. గీసుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెదలాలని చెప్పారు. నేరాలకు పాల్పడవద్దన్నారు. నేరాలు చేసినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సన్మానం



సంగెం : స్థానిక సీఐగా బాధ్యదలు చేపట్టిన మహేందర్‌ను పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, నాయకులు బుధవారం సన్మానించారు. తొలుత సీఐని నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలబొకే అందజేశారు. అనంతరం సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, భరత్, కోమల, సంజీవరెడ్డి, నరేందర్, సంపత్, రవి, జీవన్, కుమార్, నరేశ్, ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏడీఈగా నటరాజ్



వర్ధన్నపేట : స్థానిక విద్యుత్ శాఖ ఏడీఈగా ఎం.నటరాజ్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కన్న రాజు బదిలీపై వెళ్లగా నటరాజ్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నటరాజ్‌కు ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక



శంకర్‌రావు



కల్యాణి

సంగెం : పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కార్యవర్గాన్ని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీఓ ఆడెపు ప్రభాకర్ వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా ఆర్.శంకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా పి.కల్యాణి, ఉపాధ్యక్షురాలిగా సునీత, కోశాధికారిగా పి.శ్రీధర్, కన్వీనర్‌గా కె.నరేశ్, సలహాదారుగా షకీల్ అహ్మద్, కార్యవర్గ సభ్యులుగా యాదలక్ష్మి, రవికర్‌బాబు, ప్రవీణ, సరిత, స్వప్న, హేమలత, లావణ్య, సునీత, అనిల్, శారద ఎన్నికైనట్టు తెలిపారు.

బాలిక అదృశ్యం

నల్లబెల్లి : మైనర్ బాలిక అదృశ్యమైన ఘటన మండలంలోని బుచ్చిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. బుచ్చిరెడ్డిపల్లికి చెందిన ఓ బాలిక స్థానిక ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. బాలిక ఈనెల 11న ఫోన్ మాట్లాడుతుండగా తండ్రి మందలించాడు. మరుసటి రోజు ఉదయం ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన బాలిక కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తల్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'చలో వరంగల్'ను జయప్రదం చేయాలి

నల్లబెల్లి : తెలంగాణ విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ నేడు (గురువారం) తలపెట్టిన చలో వరంగల్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ (టీవీఏసీ జేఏసీ) నాయకుడు పాపిరెడ్డి కోరారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీజీ ఎన్‌పీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామని చెప్పారు. ఆర్టిజన్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సహ చట్టంతో అవినీతి నిర్మూలన

ఆత్మకూరు : సమాచార హక్కు చట్టంతో అవినీతి నిర్మూలన సాధ్యమౌతుందని సమాచార హక్కు రక్షణ చట్టం పరకాల డివిజన్ కన్వీనర్ నేరెళ్ల అనిల్‌గౌడ్ అన్నారు. సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని కటాక్షపూర్ గ్రామంలో బుధవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

విజృంభిస్తున్న దోమలు

- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- వైద్యం కోసం వేలాది రూపాయల ఖర్చు



నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

నర్సంపేట : జిల్లాలో కురుస్తున్న వర్షాలు, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధుల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. జిల్లాలోని 11 గ్రామీణ మండలాల పరిధిలో 325 గ్రామాలు ఉన్నాయి. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో సరిగా పారిశుధ్య పనులు చేపట్టకపోవడం, ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రి, వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి, వర్ధన్నపేటలోని సీహెచ్‌సీ తదితర ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఆర్థికంగా ఉన్నవారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు.

పెరిగిన ఆర్థిక భారం..

దోమకాటుకు గురైన వారు అనారోగ్యం పాలై ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.లక్షపైనే ఖర్చు అవుతోంది. దోమ కాటుతో మొదట జ్వరం రాగా స్థానిక వైద్యులను సంప్రదిస్తే రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు తీసుకుంటున్నారు. మందులతోపాటు పండ్లు, కొబ్బరి నీళ్లు, రవాణాకు మరింత ఖర్చు చేయాల్సిందే. ఇవేకాకుండా దోమల నివారణ కోసం వాడే ద్రవాలు, ఇంట్లోకి దోమలు రాకుండా తలుపులు, కిటికీలకు వాడే జాలీలు, దోమతెరలు, ఎలక్ట్రిక్ బ్యాట్ వంటి పరికరాలు కలుపుకుంటే ఒక్కో కుటుంబం రూ.2 వేల వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

నివారణ చర్యలు ఇలా..

- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- చేతులు, కాళ్లను కప్పి ఉంచేలా దుస్తులు ధరిస్తే ద్వారా దోమకాటు నుంచి కాపాడుకోవచ్చు.
- పడుకునేటప్పుడు తప్పని సరిగా మంచం చుట్టూ దోమతెర వేసుకోవాలి. కాయిల్స్, లోషన్లతో దోమలు దగ్గరకు రాకుండా చూసుకోవాలి.
- దోమలు బయట నుంచి ఇంట్లోకి రాకుండా కిటికీలకు జాలీలు అమర్చుకోవాలి.
- ముదురు రంగులను దోమలు ఆకర్షిస్తాయి కాబట్టి బయటకు వెళ్లేటప్పుడు లేత రంగు దుస్తులు ధరించడం మంచిది.
- మురుగు కాల్వల్లో పూడికతీసి నీరు పారేలా చేయాలి.
- మరుగుదొడ్ల గాలి గొట్టాలకు తెరలు కట్టించాలి.
- అన్ని రకాల నీటి నిల్వల్లో వారానికి ఒకసారి దోమల నియంత్రణ మందులు చల్లాలి.
- పెంట కుప్పలు, చెత్తాచెదారాన్ని తరచూ తొలగిస్తూ పరిసరాల శుభ్రత పాటించాలి.
- ఇల్లు, ఆవరణలోని పనికిరాని వస్తువుల్లో నిల్వ నీటిని తొలగించాలి.
- ఇళ్లలో నీరు నింపుకొనే పాత్రలను వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టి మళ్లీ నీరు నింపుకోవాలి.



జనావాసాల్లో నిలిచిన మురుగు నీరు



స్వైరవిహారం చేస్తున్న పందులు

ముందు జాగ్రత్తలు తీసుకోవాలి..



ప్రతీ సంవత్సరం వర్షాకాలం ప్రారంభం నుంచి చివరి వరకు ఇళ్లలోకి దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి చుట్టూ దోమలు వృద్ధి చెందకుండా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. దోమల వల్ల వచ్చే వ్యాధులకు సకాలంలో వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

– డాక్టర్ వజ్జ సాగర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్/జీఎంసీ మహబూబాబాద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నర్సంపేట : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్, ఏబీఎస్‌ఎఫ్, డీవైఎఫ్ఐ, ఎంఎస్‌ఎఫ్ నాయకులు దిడ్డి పార్థసారథి, బొట్ల నరేశ్, గడ్డమీది బాలకృష్ణ, చింతం సిద్ధూ డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం నిరసన తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం అవుతోందని ఆందోళన వెలిబుచ్చారు. స్కాలర్‌షిప్, ఫీజ రీయింబర్స్‌మెంట్ విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని చెప్పారు. విద్యా శాఖ మంత్రిని నియమించి, విద్యారంగంలో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాజేశ్, స్టాలిన్, ఇబ్రహీమ్, అశోక్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బావిలో చెత్తాచెదారం



మంచినీటి బావిలో పాకురు, చెత్తాచెదారం

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని కొనవాడ పాత పోచమ్మ వద్ద ఉన్న మంచినీటి బావిలో చెత్తాచెదారం పేరుకుపోయింది. కాగా కలుషిత నీటినే గ్రామస్తులకు సరఫరా చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలుషితమైన నీరు తాగి అనారోగ్యం బారిన పడుతున్నామంటూ పలువురు గ్రామస్తులు వాపోయారు. కలుషితమైన తాగునీటిని మూడ్రోజులకు ఓసారి మాత్రమే సరఫరా చేస్తున్నారని అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని పలువురు చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు స్పందించి మంచినీటి బావిలోని చెత్తాచెదారాన్ని తొలగింపజేయడంతోపాటు ప్రతిరోజూ శుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుట్కా స్వాధీనం.. విక్రేతపై కేసు



నర్సంపేట రూరల్ : గుట్కా ప్యాకెట్లతో సీఐ



దుగ్గొండి : తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

నర్సంపేట రూరల్ : అక్రమంగా నిల్వ చేసిన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సంపేటలోని మనోహర కిరాణంలో అనుమతి లేకుండా అంబర్, గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. రూ.10,700 విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్సై రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గిర్నిబావిలో..

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని లావణ్య కిరాణంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి రూ.7,500 విలువైన గుట్కా, అంబర్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. నిందితుడు గొట్టిముక్కుల భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొవ్వొత్తులతో నివాళి

నల్లబెల్లి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన దరణికి దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. తొలుత వేదిక ఆధ్వర్యంలో కొవొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య మాట్లాడుతూ ధరణి మృతి బాధాకరమన్నారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతోపాటు రూ.14 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు గెల్లి ప్రకాశ్, తోకల మల్లయ్య, ఉప్పుల భద్రయ్య, మల్లేశం, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

శివరామపురంలో..



రాయపర్తి : మండలంలోని శివరామపురంలో పోశాల శాంతమ్మ, మహబూబ్‌నగర్‌లో కందుకూరి కృష్ణమూర్తి తల్లి మృతి చెందగా వారి మృతదేహాలకు బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు గాదె రవీందర్‌రెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, చందు రాము, కొమ్ము రాజు, లక్కం కుమార్, చెన్నబోయిన యాకయ్య, సంతోశ్ రెడ్డి, గూడ రాజు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పిచ్చిమొక్కలు ఇలా..

మండల కేంద్రంలోని పలు కాలనీల్లో రోడ్ల వెంట పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో చిత్తడిగా మారడంతో రాత్రిపూట రోడ్ల వెంట నడవటానికి సైతం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి రోడ్ల వెంట భారీగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. - ఖానాపురం

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
సుప్రజ, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 8639178653

పరామర్శ



రాయపర్తి : మండలంలోని కొండాపురం మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి నరేందర్‌రావును మాజీ వైస్ ఎంపీపీ ఎనగందుల యాకనారాయణ బుధవారం పరామర్శించారు. నరేందర్‌రావు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రక్రాంతికుమార్, ఎద్దు రమేశ్ పాల్గొన్నారు.

నిరవధిక బంద్‌కు మద్దతు

నర్సంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ కళాశాలల యాజమాన్యాలు తలపెట్టిన నిరవధిక బంద్‌కు బాలాజీ ఫార్మసీ కళాశాల యాజమాన్యం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల నిర్వహణ కష్టంగా మారుతోందని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా సానుకూలంగా స్పందించి తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

ఖిలా వరంగల్ : వరంగల్ ఫోర్ట్ రోడ్డు రుద్రమాంబనగర్‌లో బుధవారం బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితుల నేతృత్వంలో అమ్మవార్లకు పంచామృతాభి, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు అపరాజు సారంగపాణి, వినోద్‌కుమార్, ఎనుకంటి రాజు, రవికుమార్, కార్పొరేటర్ ఉమ, నాగరాజు, రాజు, క్రాంతి, సురేష్, రవి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

ఖిలా వరంగల్ : వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లో బుధవారం మహిళలకు హక్కులు, చట్టాలపై సఖిసెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సఖి సెంటర్ ప్రతినిధులు తిరుమల, స్వప్న మాట్లాడారు. బాలికల రక్షణ, భద్రత కోసం గృహహింస, బాల్య వివాహాల నిరోధక, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్పీలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిజాయితీతో విధులు నిర్వర్తించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ తిరుపతి



సిబ్బంది కిట్లను పరిశీలిస్తున్న ఏసీపీ

సంగెం : పోలీసులు నిజాయితీతో విధులు నిర్వర్తించాలని మామునూర్ ఏసీపీ బి.తిరుపతి ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, సిబ్బంది ఉపయోగించే కిట్ ఆర్టికల్స్, సీసీ కెమెరాల పని తీరు, సన్నిహిత, రికార్డుల నమోదు, తదితరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు నిజాయితీతో వ్యవహరించాలని చెప్పారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు సాంత్వన కలిగేలా మర్యాదపూరకంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామాల్లో చోటు చేసుకుంటున్న నూతన పరిణామాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని చెప్పారు. కార్యక్రమంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, సంగెం ఎస్సై ఎల్.నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే కులగణన



పూలే చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న శ్రీనివాస్, నాయకులు

నర్సంపేట : సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో సమగ్ర కులగణన ప్రక్రియ చేపట్టేందుకు జీఓ నంబర్ 18ని విడుదల చేసిందని బీసీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం జీఓ విడుదల చేసిన నేపథ్యంలో ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని జ్యోతిరావుపూలే ప్రాంగణం వద్ద పూలే చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. కులగణన హామీ ఇవ్వడం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. జీఓ నంబర్ 26 తీసుకొచ్చి సమగ్ర కులగణనకు 150 కోట్ల బడ్జెట్ విడుదల చేసి 9 నెలలు గడచినా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ బీసీ మిలియన్ మార్చ్‌కు పిలుపునిచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ క్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌తో చర్చించి త్వరలో సమగ్ర కులగణన చేపడతామని హామీ ఇచ్చిందని తెలిపారు. మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి కులగణనకు జీఓ నంబర్ 18ని విడుదల చేస్తూ కమిటీ ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నందగిరి రజనీకాంత్, గాదెగోని భిక్షపతి, మద్దెల శ్యాంకుమార్, గట్టు ఆనంద్‌కుమార్, వోడపెల్లి రమేశ్, కందికొండ కుమార్, షేర్ల శ్రీనివాస్, బండి కొమురయ్య, గంద్రాతి శ్రీనివాస్, సామల సత్యం, ధీకొండ హేమ సుందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచుకుంటే మెరుగైన ఉద్యోగాలు

- బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : నైపుణ్యం పెంచుకుంటేనే మెరుగైన ఉద్యోగాలు లభిస్తాయని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లిలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఏర్పాటు చేసిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే సరైన నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. తద్వారా ఉత్తమ, గౌరవప్రదమైన ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. అంకుర పరిశ్రమలను స్థాపించవచ్చని చెప్పారు. విద్యార్థులు ఆధునిక నైపుణ్యాలను. నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బిట్స్ సెక్రటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు హరిహరన్, సంపత్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణ, ఏఓ సురేశ్, విభాగాధిపతులు డాక్టర్ నరేశ్, డాక్టర్ గోపీకృష్ణ, భరత్, కార్తీక్ కుమార్, ఉమారాణి, రెహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలు అధికారికంగా వేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయపర్తి : ఇందిరమ్మ కమిటీలను అధికారికంగా వేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్ల సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సుధీర్‌రెడ్డి, కుమార్, మధు మాట్లాడారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను అనధికారికంగా ఇష్టారీతిన వేస్తుండడంతో అర్హులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కమిటీలను పారదర్శకంగా రాజకీయాలకు అతీతంగా వేసి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు దక్కేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు రంగయ్య, భద్రు నాయక్, అనిరెడ్డి యాకూబ్‌రెడ్డి, చిన్నాల యాకయ్య, చిన్నాల ఉప్పలయ్య, తోట నర్సింగం, చందు రాము, చందు సతీశ్, మండల శ్రీధర్, గూబ అశోక్, సింహాద్రి, పీరని వెంకన్న, దాసరి శ్రీనివాస్, కొమ్ము రాజు, బాలునాయక్, ఐత రవి, పీరని రవీందర్, నేతావత్ శ్రీనివాస్, ఉబ్బని మధు, ఐత రజనీకాంత్, ఐత జంపి, బషీర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓంకార్ వర్ధంతి సభలు జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజాసాహెబ్, నాయకులు

నర్సంపేట : ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతి సభలు, సమావేశాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్ కోరారు. వర్ధంతి పక్షోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను పట్టణంలోని ఓంకార్ భవన్ ఆవరణలో బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 17 నుంచి 31 వరకు డివిజన్‌వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించి ఓంకార్ చరిత్రపై ప్రజలను చైతన్యవంతం చేయనున్నట్టు తెలిపారు. గీసుగొండ మండలంలోని మచ్చాపురం వద్ద 125 అడుగుల ఎత్తున్న ఓంకార్ స్మారక స్తూపం వద్ద ప్రారంభ సభ మొదలవుతుందని చెప్పారు. మచ్చాపూర్‌లో తలపెట్టిన సభకు కార్యకర్తలు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుసుంబ బాబురావు, వంగల రాగసుధ, కొత్తకొండ రాజమౌళి, కలకోట్ల యాదగిరి, కేశెట్టి సదానందం, గాజుల వెంకటయ్య, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.